ఇంటర్వ్యూ అయిపోయింది. హాజరైన పదిమంది అభ్యర్థులూ మేనేజర్ గది బయట వరండాలో గుసగుసలాడుతున్నారు. ఫలితం నోటీసు బోర్డుమీద ప్రకటిస్తానని మేనేజర్ అన్నాడు. ఎవరికి వారు ఆశతో ఆ నోటీసుకోసం ఎదురుతెన్నులు చూస్తున్నారు. ఆ పది మందిలో ఎవరెవరో ఎవరికీ తెలీదు. ఎవరికి ఎక్కువ అవకాశముందో, ఎవరి అర్హత లేమిటో తెలుసుకోవాలని అందరూ ఆరాటపడుతున్నారు. ఉన్నది ఒకటే పోస్టు. ఒక్కరికి మాత్రమే సంతోషం, మిగతా వాళ్ళకి నిరాశ. ఆ ఒక్క అదృష్టవంతుడు ఎవరో !

"మీ పేరండీ ?"

"మీనయ్యండీ - మీరు ?"

"నరసింహం."

ఒకరినొకరు పరిచయం చేసుకొంటున్నారు. ఇంటర్వ్యూ అయిపోయేదాకా మంత్రం వేసినట్టు ఎవరిమటుకు వాళ్ళు తమ కాగితాలు చూసుకుంటూనో, అటూ ఇటూ పచార్లు చేస్తూనో, ఆఫీసులో సమాచారం తెలుసుకోటానికి ప్రయత్నం చేస్తూనో చెట్టొక పిట్టగా ఉన్నారు. ఇంటర్వ్యూ కాగానే అందరిలో ఏదో చలనం కలిగినట్టూ, ఏదో బాంధవ్యం తెలిసినట్టూ అనుభూతి పొంది ఇతర్ల సమాచారం తెలుసుకోవాలని ఉత్సాహ పడసాగారు.

"కూర్మయ్యండీ."

"పరశురాం సార్"

"గౌతమ్"

"రామ్మూర్తి"

"కృష్ణ"


"వరాహరాజు"

"వామనరావు"

"యుగేశ్వర్"

"ఒక్కటే పోస్టుట గదండీ."

"అవును. మనలో ఒక్కడినే ఆయన వరించాలి.



"భరించాలనండి."

"మీరు గ్రాడ్యుయేటా ?"

"అవునండి బి.ఎస్సీ. ఫస్ట్‌క్లాస్. మీరు ?"

"పోస్ట్ గ్రాడ్యుయేట్‌నని భయపడ కండి. బి.ఏ."

"నేను ఎం.ఏ. చేశానండి."

"క్లాసా ?"

"సెకండ్".

"నేను బి.కామ్., బి.ఎల్. పూర్తి చేశాను సార్."

"ఇంకేం, మీకు మంచి ఛాన్సుంది"

"ఆఫీసులో చెప్పారు. పోస్ట్ గ్రాడ్యు యేట్స్ ఫస్ట్‌క్లాసు అభ్యర్థులు కూడా ఉన్నార్ట."

"నేను ఎం.కాం. ఫస్ట్ క్లాసండి."

"ఐసీ — కాని మీ కెందుకండీ ఈ పెట్టీ పి.ఏ జాబ్."

"ఈ రోజుల్లో ఏ ఉద్యోగం వచ్చినా కళ్ళకద్దుకోవలిసిందే కదండీ. నిజానికి నేను బస్‌కండక్టరు ఉద్యోగానికి కూడా దరఖాస్తు చేశాను. వస్తే తప్పక వెడతాను."

"ష్యూర్ - డిగ్నిటీ ఆఫ్ లేబర్."

"ఎందుకండీ అంత పెద్దమాట - డిగ్నిటీ ఆఫ్ ఎంప్లాయ్‌మెంట్ అనండి."

"ఇంటర్‌వ్యూలో మిమ్మల్నేం అడిగాడండీ."

"ఆఁ ఏం చెప్పమంటారు - అడిగే వాడికి చెప్పేవాడు లోకువ."

"నన్నూ రెండూ రెండూ ఎంత అని అడిగాడండి. ఏం ప్రశ్న !"

"ఏం చెప్పారు ?"

"ఏముందీ నాలుగన్నాను."

"నన్నూ ఆ ప్రశ్నే అడిగాడండీ. నాలుగనే చెప్పాను."

"నేనూ అంతే."

"నేనూ"

"మీ అందరికీ ఇది మొదటి ఇంటర్వ్యూలా ఉంది. దీనికి అన్సర్ నాలుగుకానీ, ఇరవై రెండు గానీ ఏదైనా కావొచ్చు." అదే చెప్పాను. నావైపు కొంచెం గుర్తుగా చూసాడు.

"ఎందువల్ల ?"

"నాలుగు అని సమాధానం చెప్పే వాడు జీవిత వ్యవహారాల్లో సూటిగా ఉంటాడనీ, ఇరవై రెండు అని చెప్పే వాడు కొంచెం డొంకతిరుగుడు మని షనీ, నాలుగూ, ఇరవై రెండూ ఏదైనా కావొచ్చని చెప్పేవాడు రాజకీయుడనీ సైకాలజిస్టు లంటారు. అందువల్ల."

నవ్వులు.

"మీరు రాజకీయులన్నమాట."

"చెప్పాము గదండీ. మొదటి ఇంటర్వ్యూలో నేనూ నాలుగనే అన్నాను. తరవాత తెలివి మారాను."

"అనగ అనగా తెలివి అతిశయిల్లు"

నవ్వులు.

ఇంతలో జమాను నోటీసు బోర్డు మీద ఒక కాగితం అంటించి వెళ్ళాడు. అభ్యర్థులందరూ చుట్టూ మూగి ఒకరి తలమీదినుంచి మరొకరు నోటీసుకేసి చూసి తలలు వేలాడేశారు.

"ఇంటర్వ్యూకు వచ్చిన పది మంది అభ్యర్థుల్లో ఏ ఒకరికీ పి.ఏ. పదవికి సరిపోయే అర్హతలు లేవని మేనేజరు గారు అభిప్రాయపడడంవల్ల ఈ పదవికి నియామకం వాయిదా వెయ్యడమయింది.

— (సం) మేనేజర్."

పాలిపోయిన వదనాలు క్రమ క్రమంగా అరుణవర్ణం దాల్చాయి.

"ఎవరికీ అర్హతలు చాలవా !"

"గ్రాడ్యుయేట్లు, పోస్టు గ్రాడ్యుయేట్లు కొరగారా !"

"అవునండీ, కొరగారు. నా మట్టుకు నాకు ఈ ఉద్యోగానికి తగిన అర్హత లేదు. ఆ విషయం ఇంటర్వ్యూలో తేటతెల్లంగా మేనేజర్ ముఖాన కొట్టినట్టు చెప్పాడు."

"వాట్ - మీరు ఎం.కాం. ఫస్ట్‌క్లాస్ కదండీ."

"ఏం అయితే ! నాకు పాట రాదు."

"పాటా ?"

"ఏం పాట? యుమీన్ మ్యూజిక్—"

"గాత్రమా, వాయిద్యమా - నాకు ఫ్లూ టొచ్చు - కాని నన్నడగలేదే మేనేజర్."

"నాకు కర్నాటిక్ మ్యూజిక్‌లో డిప్లొమా ఉంది. నన్నూ అడగలే."

"ఆ పాట కాదు. వేలం పాట. ఉద్యోగం కొనటానికి బిడ్డింగ్."

"లంచం !"

"ఏం మిమ్మల్ని అడగలేదా ?"

"నో — ఆఁ — అన్నట్టు సౌండ్ చేశాడండోయ్- "ఉద్యోగమిస్తే మొదటి సంవత్సరం జీతంతో ఏంచేస్తావు? అన్నా డండీ. ఏం చెయ్యటాని కేముందండీ - ముసలితల్లీ, తండ్రీ,తమ్ముళ్ళూ, చెల్లెళ్ళూ వాళ్ళ భారం అంతా నాదేనండీ- సొంతా నికి నే నేం ఖర్చుపెట్టుకోలేనండీ'' అన్నాను.

"ఇంకేం మరి- ఆయనకి కావలసిన జవాబు — మీరేం చెయ్యమంటే అదే చేస్తానండీ ! అని. ఇంకా కొన్ని ఇంటర్వ్యూలకి వెడితే తెలుస్తుంది లెండి."

"మరి తెలిసినవారు మీరు అలా ఎందుకనలేదు ?"

"నేను ఉద్యోగం కొనను-స పాదించు కొంటాను."

"హౌ ?"


"పోట్లాడి సంపాదించుకుంటాను. పిటీషన్లు పెడతాను. రచ్చ కీడుస్తాను."

"మీరు మహజరు పెడితే నేనూ సంతకం పెడతానండీ."

"నేనూ."

"నేనూనండి..."

"కాగితాలమీద మన అర్హతలన్నీ రాసే ఉన్నాయి. ఇంటర్వ్యూలో




ఫెయిల్ అయినామని అనటానికి ఆయన అడిగిన ప్రశ్నలు గొప్పవేం కావు. ఇదంతా ఫార్స్. ఆయనకి బేరం రాలేదు. అమ్మకం లేదు అంతే !"

"కరప్ట్."

"ఫ్రాడ్ ఆన్ అజ్."

''డౌన్ విత్ హిమ్."

''ఇది మనం సహించం."

"ఈ అన్యాయం అంతంచేసి తీరుతాం."

"అంతు తేలుస్తాం."

"పదండి."

దడాలున స్వింగ్‌డోర్ తీసుకొని పదిమందీ మేనేజర్ రూంలోకి జొరబడ్డారు.

"మాకు న్యాయం కావాలి. వుయ్ వాంట్ జస్టిస్."

ఒక్కుమ్మడిగా కేకలు.

మేనేజరు తలెత్తి చూసి నిర్విణ్ణుడయాడు. భయభ్రాంతుడయాడు. తత్తరపడిపోయాడు. "ఏ... ఏ... ఏమిటిది - ఈ... దౌర్జన్యం ?" తెచ్చిపెట్టుకున్న బిగువుతో గట్టిగా అనబోయి హీనస్వరంతో అన్నాడు.

"ధర్మం మూడు కాళ్ళమీద నడవటానికి ఇహ వీల్లేదు. మీ లంచగొండితనానికి స్వస్తి చెప్పండి. మా పదిమందిలో మీరు ఈ ఉద్యోగానికి ఒకడిని నియమించి తీరాలి."

"నియమించి తీరాలి."

"యు మస్ట్."

"లేకపోతే ఈ బల్లలూ, కుర్చీలూ, ఈ ఆస్తి అంతా ధ్వంసమై పోతుంది."

"ధ్వంసం చేసేస్తాం."

మేనేజర్ అప్రయత్నంగా టెలిఫోను తీసాడు.

"ఖబర్దార్. టెలిఫోను కింద పెట్టేయాలి. లేకపోతే టెలిఫోను బద్దలై పోతుంది."

మేనేజరుకి ఏం తోచలేదు. కళ్ళప్పగించి వాళ్ళవైపు చూడసాగాడు. వాళ్ళందర్నీ ఇంతకుముందు విడి విడిగా చూసాడు. తను వేసే ప్రశ్నలకి బెదుర్తూ కుక్కపిల్లలా కుయ్ కుయ్ మని జవాబు గొణిగినవాడే ప్రతివాడూ. ఆ వైఖరికీ, ఆ కళ్ళలోని బెదురుకీ, ఆ తొట్రుపాటుకీ, ఆ విధేయతకీ నవ్వుకొంటూ తను ఈసడించినవాడే ప్రతివాడూ. కావలసిన వస్తువుని కొనలేక దానివైపు పిరికిచూపులు చూసే వినియోగదారుడిలా ప్రతివాడూ ఆశగా, పిరికిగా, దీనంగా, జాలిగా తనవైపు తన కటాక్షవీక్షణాలకోసం ఎదురుతెన్నులు చూసినవాడే ప్రతివాడూ. ఆ అన్ని వదనాల్లో అమాయకతో, తెలివితక్కువతనమో ఏదో ఉన్నట్టు చూచాయగా తనకి తట్టింది. కాని ఇప్పుడు అవే ముఖాల్లో ఏదో కొత్తదనం. ఏదో కత్తీ. ఏదో విశేషం తాండవిస్తోంది. ప్రతి వ్యక్తీ తను పూర్వం ఎరిగిన మంచి మనిషిగా కాక తను పీడకలలో చూసిన బలవంతుడైన విరోధిలా కనిపిస్తున్నాడు. ఎవరు ఎవరో ఏమీ తెలియటంలేదు. ఈ అందరిలో అంతవరకూ అదృశ్యంగా ఉన్న కొత్తమనిషి ఎవరో తొంగి చూస్తున్నాడు. ఎవరు - ఎవరా కొత్త మనిషి ? ఈ పదిమందిలో తొంగిచూసే ఆ పదకొండో మనిషి ఎవరు ... ? పది తలలూ రాను రాను మరీ మరీ పెద్దగా కనిపించసాగాయి. ప్రతి తలా ఓసారి నవ్వుతూ, ఓసారి కళ్ళెఱ్ఱజేస్తూ తనవైపు మార్చి మార్చి చూస్తున్నాయి. ప్రతి మనిషి భగవత్ స్వరూపుడని తను చదివాడు. ఎవరీ భగవత్ స్వరూపుడు ! ఎవరీ ప్రతిమనిషీ– శివుడో, మాధవుడో ............ మేనేజరు స్పృహతప్పి పడిపోయాడు.